రైతు బీమాను అర్హులైన రైతులు వినియోగించుకోవాలి

● జిల్లా వ్యవసాయ అధికారి శ్రీధర్‌రెడ్డి

రైతుబీమా కరపత్రాలను ఆవిష్కరిస్తున్న డీఏఓ

పెన్‌పహాడ్, జూలై 23 : కొత్తగా భూములు కొనుగోలు చేసి పట్టాలు చేయించుకున్న రైతులు రైతు బీమాకు దరఖాస్తు చేసుకోవాలని జిల్లా వ్యవసాయ అధికారి శ్రీధర్‌రెడ్డి సూచించారు. మంగళవారం మండల కేంద్రములోని రైతు వేదికలో రైతుల నుంచి దరఖాస్తులు స్వీకరించి మాట్లాడారు. ఈ సంవత్సరం ఆగస్టు 15 నుంచి ప్రారంభమవుతున్న రైతు బీమాకు సంబంధించి కొత్తగా దరఖాస్తులను ఆయా గ్రామాల రైతు వేదికల వద్ద స్వీకరిస్తున్నట్లు తెలిపారు. జూన్ 28, 2024 లోపు భూములు కొనుగోలు చేసిన రైతులు డిజిటల్ పట్టాదారు పాసుపుస్తకం, ఆధార్‌కార్డు, నామినీకి చెందిన ఆధార్ జిరాక్స్‌ను దరఖాస్తుకు జత చేయాలని సూచించారు. ఈ నెల 30 లోపు దరఖాస్తు చేసుకోవాలన్నారు. అనంతరం రైతు బీమాకు సంబంధించిన కరపత్రాలను ఆవిష్కరించారు. కార్యక్రమములో ఏఓ కృష్ణసందీప్, ఏఈఓ సంధ్య, రైతులు పాల్గొన్నారు.

ఎస్సారెస్పీ నీళ్లిచ్చి రైతులను ఆదుకోవాలి

బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు తాటికొండ సీతయ్య

సమావేశంలో మాట్లాడుతున్న తాటికొండ సీతయ్య

తిరుమలగిరి(తుంగతుర్తి), జూలై 23 : ఎస్సారెస్పీ ప్రాజెక్టు నుంచి నీళ్లు విడుదల చేసి వర్షాభావ పరిస్థితుల నుంచి రైతులను కాపాడాలని బీఆర్ఎస్ తుంగతుర్తి మండలాధ్యక్షుడు తాటికొండ సీతయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం తుంగతుర్తి బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రస్తుత సీజన్‌లో అనుకున్న స్థాయిలో వర్షాలు కురువక పోవడంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. కాళేశ్వరం వద్ద ఏర్పాటు చేసిన బాహుబలి మోటర్ల ద్వారా నీరు లిఫ్ట్ చేసి ఎస్సారెస్పీ ప్రాజెక్టును నింపి అక్కడి నుంచి తుంగతుర్తి ప్రాంతానికి నీరు అందించాలని కోరారు. ఎస్సారెస్పీ నీటి విడుదల జాప్యం చేస్తే రైతులు ఒక సీజన్ పంట నష్టపోవాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా స్థానిక ఎమ్మెల్యే చొరవ తీసుకొని ఎస్సారెస్పీ నీటిని విడుదల చేయించి రైతులను ఆదుకోవాలన్నారు. సమావేశంలో పార్టీ జిల్లా నాయకులు గుండగాని రాములుగౌడ్, తునికి సాయిలు, పట్టణ అధ్యక్షుడు గోపగాని శ్రీనివాస్, తడకమల్ల రవికుమార్, మల్లెపాక వెంకన్న, దశరథ, మల్లేశ్ పాల్గొన్నారు.

వరల్డ్ బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో స్థానం సాధించిన చిన్నారులకు సన్మానం

చిన్నారులను సన్మానిస్తున్న క్లబ్ సభ్యులు

నేరేడుచర్ల, జూలై 23 : వరల్డ్ బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో స్థానం సాధించిన నేరేడుచర్ల పట్టణానికి చెందిన ఇద్దరు చిన్నారులను మంగళవారం వాసవి, వనితా క్లబ్ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. పట్టణానికి చెందిన అనూష, శివప్రసాద్ దంపతుల కూతురు శ్రీరంగం ఉపాసన, ఓరుగంటి పవన్ కుమార్, రేణుక దంపతుల కూతురు ఓరుగంటి రేయన్స్ రెండున్నరేండ్ల వయస్సులోనే 15 నిమిషాల్లో 150 ప్రశ్నలకు సమాధానం చెప్పి ప్రపంచ రికార్డు సొంతం చేసుకున్నారు. వారికి శాలువాలతో సన్మానించి, జ్ఞాపికలను అందించారు. కార్యక్రమంలో క్లబ్ వైస్ గవర్నర్ రాచకొండ విజయలక్ష్మి, ఏపీసీ గరిణే అరుణాకుమారి, సభ్యులు కందిబండ వాసంతి, కొత్త లక్ష్మణ్, వీరవెల్లి శ్రీలత, రాచకొండ శ్రీనివాస్, కందిబండ శ్రీనివాస్, గోపాల కృష్ణ, ప్రభాకర్, సంతోశ్ పాల్గొన్నారు.

గంజాయి తరలిస్తున్న వ్యక్తి అరెస్ట్

పెన్‌పహాడ్, జూలై 23 : బైక్‌పై గంజాయిని తరలిస్తున్న వ్యక్తిని పెన్‌పహాడ్ పోలీసులు పట్టుకొని రిమాండ్‌కు తరలించారు. మంగళవారం సీఐ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో డీఎస్పీ రవి ఈ కేసుకు సంబంధించిన వివరాలు వెల్లడించారు. సోమవారం మండలంలోని సింగారెడ్డిపాలెం బోసిగుంట చెరువు వద్ద పెన్‌పహాడ్ ఎస్ఐ రవీందర్ తన సిబ్బందితో కలిసి వాహనాల తనిఖీ చేపట్టారు. మండలంలోని మాచారంకు చెందిన బొమ్మకంటి గోపి పల్సర్‌బైక్‌పై సూర్యాపేట వైపునకు వెళ్తుండగా పోలీసులు ఆపినా ఆపకుండా స్పీడ్‌గా వెళ్లి పోయాడు. పోలీసులు అతడిని వెంబడించి పట్టుకొని తనిఖీ చేయగా బైక్ కవర్‌లో కేజీ గంజాయి ప్యాకెట్ లభించింది. గోపి చిలుకూరు మండలం బేతవోలుకు చెందిన తన స్నేహితుడితో కలిసి ఆంధ్రా-ఒరిస్సా సరిహద్దు వద్ద గంజాయిని కొనుగోలు చేసి సూర్యాపేట పరిసర ప్రాంతాల్లో విక్రయిస్తున్నట్లు పోలీసుల విచారణలో తేలింది. గంజాయి తరలిస్తున్న బొమ్మకంటి గోపితో పాటు అతడి స్నేహితుడు గుండు గోపి, వీరికి గంజాయి విక్రయించిన బాపుపై కేసు నమోదు చేశారు. బొమ్మకంటి గోపిని కోర్టుకు రిమాండ్ చేసినట్లు డీఎస్పీ తెలిపారు. నిందితుడిని పట్టుకున్న ఎస్ఐ రవీందర్‌తో పాటు సిబ్బందిని డీఎస్పీ అభినందించారు.

సమావేశంలో సీఐ సురేందర్‌రెడ్డి ఎస్ఐ, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

బహిరంగ ప్రకటన

ఇందుమూలముగా నా క్లయింటు M/s. Shriram Finance Ltd., Tirumalagiri Branch వారు ఇచ్చిన బొగొట్టు ప్రకారం యాన్నంకికి తెలుపునది ఈ క్రింది షెడ్యూలులో మాపిన స్థిరాస్తి రిజిస్టార్ తనఖా చేయించుకొని, శ్రీ/శ్రీమతి కొండగడుపుల వెంకన్న, తండ్రి: మల్లయ్య గారికి ఋణము ఇచ్చుటకు నిర్ణయించుకోన్నాము. కావున సదరు వ్యవహారమకు సంబంధించి, సదరు షెడ్యూలు స్థిరాస్తిపై ఎవరికైననూ ఎటువంటి జప్తులు, చార్జీలు, క్లెయిములు, తనఖాలు, అగ్రిమెంట్సు, కోర్టు వివాదములు తదితర అశ్యంతరములు ఉన్న యెడల నాటి నుండి (7) ఏడు దినములలో ఈ క్రింద చూపిన చిరునామాకు వ్రాత పూర్వకముగా తెలియజేయగలరు. తదుపరి అభ్యంతర-ములకు నా క్లయింటు బాధ్యులు కాదు.

SCHEDULE OF THE PROPERTY

జిల్లారిజిస్ట్రార్ నల్లగొండ, సబ్-రిజిస్ట్రార్ సూర్యాపేట వారి జ్యూరిస్ డిక్షన్‌లోనూ, జిల్లా పరిషత్ సూర్యాపేట, మండల పరిషత్ తుంగతుర్తి, గ్రామ పంచాయితీ బోర్డు తుంగతుర్తి, తుంగతుర్తి గ్రామ శివారులో గల ఇల్లు ఇంటి నెం. 5-158A గల ఇంటి విస్తీర్ణం: 393.00 చ.గ.లు, సరియగు 328.59 చ.మీ.లలో కట్టబడి విస్తీర్ణం: 561.00 చ.అ.ల ఆర్.సి.సి. తో నిర్మితము కబడినట్టి ఇల్లు ఇంటీరియల్ రెసిడెన్షియల్ ఏరియాలో ఉండి ఈ దిగువ హద్దులు కలిగి యున్నది. హద్దులు: ఉత్తరము: బోయిన లింగయ్య గారి ఇల్లు, దక్షిణము: 20 అడుగుల రోడ్డు, తూర్పు: బొజ్జ యాదగిరి గారి ఇల్లు, పడమర: కొండగడుపుల ఎల్లయ్య గారి ఇల్లు.

Sd/- NALLELLA SURENDER, NALLELLA SUHAS
ADVOCATES, H.No. 1-8-489, Haritha Residency, Balasamudram, HNK, Warangal. Cell: 9849365117

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్ NAMASTHE TELANGANA CLASSIFIEDS

LOST

★ అలకుంట్ల శ్రీధర్, S/o. లేట్ అలకుంట్ల యాదగిరి, R/o. నవ్య నిలయం, విద్యానగర్, ఎదురుగా, సబ్-జైలు రోడ్, మిర్యాలగూడ, జిల్లా: నల్గొండ-508 207 అనే నేను తేది: 02/06/2024 ఉదయం 10 గంటలకు మిర్యాలగూడ RTC బస్టాండ్‌లో నా ఒరిజినల్ పాస్‌పోర్ట్ నెం. W4054804, జారీ చేసిన తేది: 01/09/2022 పోయినది. ఎవరికైనా దొరికినవారు సంప్రదించగలరు. Ph: 9866582282.
NT-325896

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

మీకు కావలసిన సమాచారం కొరకు సులభమైన మార్గం... మన "నమస్తే తెలంగాణ" క్లాసిఫైడ్స్‌లో ప్రకటన ఇవ్వడం...
ప్రతి 4 లైన్ల క్లాసిఫైడ్‌కు 200/- ప్రతి అదనపు లైన్‌కు 50/-
Note: 3+1 Scheme Available Minimum 4 Lines, Extra Line - Extra Amount
నమస్తే తెలంగాణ యూనిట్ కార్యాలయం, గ్రా: చర్లపల్లి, మం: నల్లగొండ.
నల్లగొండ : 9182777626 | నల్లగొండ : 9182777635 | దేవరకొండ : 9182777635
హుజూర్‌నగర్ : 9182777059 | సూర్యాపేట : 9182777630 | భువనగిరి : 9182777630
మిర్యాలగూడ : 9182777059 | కోదాడ : 9182777196 | తుంగతుర్తి : 9182777630

పోలీసులు పట్టుకున్న లారీలో పీడీఎస్ బియ్యం లేవు

డీటీసీఎస్ రాజశేఖర్

మేళ్లచెర్వు, జూలై 23 : మండల కేంద్రం శివారులో సోమవారం రాత్రి ఎస్‌బీ పోలీసులు 20 టన్నుల బియ్యం లోడుతో ఉన్న లారీని నిలిపి తనిఖీలు చేపట్టారు. అయితే అందులో ఉన్నవి రేషన్ బియ్యంగా అనుమానించి స్థానిక పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. మంగళవారం హుజూర్‌నగర్ డీటీసీఎస్ రాజశేఖర్ స్టేషన్‌కు చేరుకొని పంచనామా చేశారు. లారీలో పీడీఎస్ బియ్యం లేవని, అవి సార్టెడ్ చేసిన బియ్యంగా గుర్తించారు. సదరు బియ్యం మండల కేంద్రంలోని రైస్ మిల్లు నుంచి కల్వకుర్తిలోని బీర్ల తయారీ కంపెనీకి తరలిస్తున్నట్లు వే బిల్లుల్లో ఉన్నట్లు తెలిపారు. ఆయన వెంట ఎస్ఐ పరమేశ్, సిబ్బంది ఉన్నారు.

మహిళా సాధికారతకు అధికారులు కృషి చేయాలి

● కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్

అధికారులతో సమీక్ష నిర్వహిస్తున్న కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్

సూర్యాపేట, జూలై 23 : పొదుపు సంఘాల్లో సభ్యులుగా ఉన్న మహిళలకు ఎంబ్రాయిడింగ్, బేకరీ ఉత్పత్తుల తయారీలో శిక్షణ ఇప్పించి వారిని ఆర్థికంగా బలోపేతం చేసేందుకు కృషి చేయాలని కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లోని కాన్ఫరెన్స్ హాల్లో జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రస్తుతం మహిళా సాధికారత కోసం మహిళా శక్తి పేరిట ప్రభుత్వ కార్యాలయాల్లో క్యాంటీన్ల ఏర్పాటు కోసం ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. ఇప్పటి వరకు జరిగిన లబ్ధిదారుల ఎంపిక, మైక్రో క్రెడిట్ ప్లాన్‌ను బ్యాంకుల్లో సమర్పించాలని ఆదేశించారు. వారికి జిల్లా సమాఖ్య కార్యాలయంలో శిక్షణ నిర్వహించాలన్నారు. ప్రతి నెలా నిర్వహించే జిల్లా సమాఖ్య, మండల సమాఖ్య, గ్రామ సమాఖ్య సమావేశాలు నిర్వహించి అధికారులు హాజరు కావాలన్నారు. కొత్త సంఘాల ఏర్పాటును వేగవంతం చేయాలని, స్కూల్ యూనిఫాం కుట్టే యూనిట్లను బలోపేతం చేసి ప్రైవేటు కంపెనీల డ్రెస్‌లు కూడా కుట్టించి వారికి ఆదాయం సమకూరేలా చూడాలన్నారు. సమావేశంలో డీఆర్‌డీఓ మధుసూదన్‌రాజు, అడిషన్ పీడీ రామ్ సురేశ్, డీపీఎంలు, ఏపీఎంలు పాల్గొన్నారు.

కారు ఢీకొని యువకుడి మృతి

కోదాడ రూరల్, జూలై 23: పట్టణ శివారులోని కటకొమ్ముగూడెం వద్ద 65 జాతీయ రహదారిపై మంగళవారం కారు ఢీకొని యువకుడు మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. పట్టణంలోని అంబేద్కర్‌నగర్‌కు చెందిన చింత రాజు(25) ఉత్తమ్ పద్మావతి నగర్‌లోని తాను నిర్మిస్తున్న ఇంటి వద్దకు బైక్‌పై వెళ్లి తిరిగి వస్తుండగా హైదరాబాద్ నుంచి విజవాడ వైపు వెళ్తున్న కారు వేగంగా వచ్చి నెనుక నుంచి ఢీకొట్టింది. దాంతో రాజుకు తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడి తండ్రి శ్రీనివాస్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పట్టణ ఎస్ఐ రంజిత్‌రెడ్డి తెలిపారు.

'నేడు కేటీఆర్ జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించాలి'

నేరేడుచర్ల, జూలై 23 : బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కల్వకుంట్ల తారకరామారావు జన్మదిన వేడుకలను నియోజకవర్గ వ్యాప్తంగా ఘనంగా నిర్వహించాలని బీఆర్ఎస్ పార్టీ నియోజకవర్గ సమన్వయ కమిటీ ఇన్‌చార్జి ఒంటెద్దు నర్సింహారెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో పిలుపునిచ్చారు. గత ప్రభుత్వ హయాంలో ఐటీ రంగంలో తెలంగాణను ప్రపంచానికి పరిచయం చేసిన ఘనత కేటీఆర్‌దే అన్నారు.

బడ్జెట్‌లో విద్యారంగానికి 30 నిధులు కేటాయించాలి : పీడీఎస్‌యూ

మోతె, జూలై 23 : రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టే బడ్జెట్‌లో విద్యారంగానికి 30 శాతం నిధులు కేటాయించాలని పీడీఎస్‌యూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి విప్లవరాజు మంగళవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. విద్యార్థులకు పెండింగ్‌లో ఉన్న స్కాలర్‌షిప్, ఫీజు రీయింబర్స్‌మెంట్‌ను వెంటనే విడుదల చేయాలని కోరారు. రాష్ట్రంలో ఖాళీగా ఉన్న 2.50 లక్షల ఉద్యోగాలను వెంటనే భర్తీ చేయాలని, ప్రభుత్వ సంక్షేమ హాస్టళ్లకు సొంత భవనాలు నిర్మించాలని డిమాండ్ చేశారు.

ఆరోగ్య మహిళ హెల్త్ క్యాంప్

నూతనకల్, జూలై 23 : రాష్ట్ర ప్రభుత్వం మహిళల కోసం తీసుకొచ్చిన ఆరోగ్య మహిళ కార్యక్రమంలో భాగంగా మంగళవారం మండలకేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలో ప్రత్యేక వైద్య శిబిరం నిర్వహించారు. మండలంలోని వివిధ గ్రామాల నుంచి మహిళలు అధిక సంఖ్యలో వచ్చి పరీక్షలు చేయించుకున్నారు. 32 మంది మహిళలు నుంచి రక్త నమూనాలను సేకరించి పరీక్షలు చేశామని, అనుమానం ఉన్న 12 మంది రక్త శ్యాంపిల్స్‌ను జిల్లా కేంద్రంలోని టీహాబ్‌కు పంపించామని డాక్టర్ తెలిపారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది తారమ్మ, వెంకటరెడ్డి, ఆనంద్, సీతారాంరెడ్డి పాల్గొన్నారు.

ఫిజియో థెరపీకి పేర్లు నమోదు చేసుకోవాలి : ఎంఈఓ

నూతనకల్, జూలై 23 : ఫిజియోథెరపీ కోసం ప్రత్యేక అవసరాలు గల విద్యార్థులు ఆయా పాఠశాలల్లో పేర్లు నమోదు చేసుకోవాలని ఎంఈఓ రాములునాయక్ సూచించారు. మండలకేంద్రంలోని ఎమ్మార్సీ భవనంలో ప్రత్యేక అవసరాలు గల విద్యార్థులకు మంగళవారం ఫిజియోతెరపీ నిర్వహించారు. కార్యక్రమంలో ఫిజియోథెరపిస్ట్ డాక్టర్ కృష్ణ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

షీటీమ్ ఆధ్వర్యంలో విద్యార్థినులకు అవగాహన

మోతె, జూలై 23 : మండల కేంద్రంలోని కసూర్బా గాంధీ పాఠశాలలో సూర్యాపేట షీటీమ్ ఆధ్వర్యంలో మంగళవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా షీటీమ్ ఎస్ఐ నీలిమ మాట్లాడుతూ పాఠశాలలో 500 మంది బాలికలకు మహిళల భద్రత, రక్షణ, మత్తు పదార్థాలు, గంజాయి వల్ల కలిగే అనర్థాలపై అవగాహన కల్పించారు. సైబర్ మోసాలపై 1930 టోల్ ఫ్రీ నంబర్‌కు ఫిర్యాదు చేయాలని సూచించారు. కార్యక్రమంలో షీటీం ఏఎస్ఐ సాలయ్య, హెడ్‌కానిస్టేబుల్ ఎల్లారెడ్డి, మౌనిక, కిరణ్మయి, పాఠశాల ప్రత్యేకాధికారి ధనలక్ష్మి పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై అవగాహన

తిరుమలగిరి(నాగారం), జూలై 23 : సైబర్ నేరాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని నాగారం ఏఎస్ఐ వెంకటరాములు అన్నారు. మంగళవారం క్రాస్‌రోడ్ వద్ద ప్రజలకు సైబర్ నేరాలు, మాదక ద్రవ్యాల నివారణపై అవగాహన కల్పించారు. అనుచిత ఫోన్ కాల్స్, మేసేజ్‌లను నమ్మి మోసపోవద్దని సూచించారు. మత్తు పదార్థాల బారిన పడకుండా ఉండాలన్నారు. కార్యక్రమంలో సిబ్బంది పాల్గొన్నారు.

ఎప్పటికప్పుడు వాహనాల తనిఖీ చేపట్టాలి

● ఎస్పీ సన్‌ప్రీత్‌సింగ్

చివ్వెంల పోలీస్ స్టేషన్‌ను తనిఖీ చేస్తున్న ఎస్పీ

చివ్వెంల, జూలై 23 : పోలీస్ స్టేషన్ పరిధిలో నిత్యం వాహనాల తనిఖీతో పాటు డ్రంకెన్ డ్రైవ్, ప్రజలకు భరోసా ఇచ్చే కార్డెన్ సెర్చ్ నిర్వహించాలని జిల్లా ఎస్పీ సన్‌ప్రీత్‌సింగ్ సూచించారు. మంగళవారం చివ్వెంల పోలీస్ స్టేషన్‌ను ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోలీస్ స్టేషన్‌కు వచ్చే ప్రతి ఫిర్యాదుదారులకు కనీస సౌకర్యాలు కల్పించాలని, వారితో మర్యాదగా ప్రవర్తించి, సహాయ సహకారాలు అందించలని సూచించారు. అక్రమ గంజాయి రవాణాపై, పాత నేరస్తులపై ప్రత్యేక నిఘా ఉంచాలన్నారు. ఆయన వెంట డీఎస్పీ రవి, ఎస్ఐలు వెంకట్ రెడ్డి, కనకరత్నం, సిబ్బంది ఉన్నారు.

మొక్కలు నాటి పర్యావరణాన్ని పరిరక్షించాలి

● జిల్లా పరిశ్రమల అధికారి సీతారామ్

మొక్క నాటుతున్న సీతారామ్

మేళ్లచెర్వు, జూలై 23 : మొక్కలు విరివిగా నాటి పర్యావరణాన్ని పరిరక్షించాలని జిల్లా పరిశ్రమల అధికారి సీతారామ్ సూచించారు. స్థానిక మైహోం సిమెంట్ పరిశ్రమలో మంగళవారం నిర్వహించిన వనమహోత్సవ కార్యక్రమంలో ఆయన పాల్గొని మొక్కలు నాటారు. ప్రతి సంవత్సరం 5 వేల మొక్కలు నాటి వాటిని సంరక్షించాలని పరిశ్రమ అధికారులకు సూచించారు. కార్యక్రమంలో ఇండస్ట్రియల్ ప్రమోషనల్ అధికారి భరత్‌రెడ్డి, పరిశ్రమ ప్రతినిధులు పాల్గొన్నారు.

రైస్ మిల్లుల తనిఖీ

శ్రీలక్ష్మి రైస్‌మిల్లును తనిఖీ చేస్తున్న ఆర్‌డీఓ

తిరుమలగిరి, జూలై 23 : మండల కేంద్రంలోని శ్రీలక్ష్మి, హర్షా రైస్ మిల్లులను సూర్యాపేట ఆర్‌డీఓ వేణుమాధవ్ మంళవారం తనిఖీ చేశారు. ఈ రెండు మిల్లులు సీఎంఆర్ బకాయి ఉండడంతో స్టాక్ వివరాలతో పాటు రికార్డులు పరిశీలించారు. అనంతరం స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మధ్యాహ్నం భోజనాన్ని పరిశీలించారు. ఆయన వెంట తాసీల్దార్ సుధ, డీటీ జాన్‌పాషా, పాఠశాల హెచ్ఎం శ్రీనివాస్ ఉన్నారు.

నిబంధనలు పాటించని క్రషర్ మిల్లును సీజ్ చేయాలి

● తాసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా

ధర్నా చేస్తున్న సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్ నాయకులు

మోతె, జూలై 23 : మండలంలోని రాఘవాపురం గ్రామ శివారులో నిబంధనలకు విరుద్ధంగా ఏర్పాటు చేసిన క్రషర్ మిల్లును వెంటనే సీజ్ చేయాలని సీపీఐ(ఎంఎల్) మాస్ లైన్ మండల కమిటీ ఆధ్వర్యంలో మోతె తాసీల్దార్ కార్యాలయం ఎదుట మంగళవారం ధర్నా నిర్వహించారు. అదే సమయంలో అక్కడికి వచ్చిన కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్‌కు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా పీడీఎస్‌యూ రాష్ట్ర సహాయ కార్యదర్శి ఎర్ర అఖిల్‌కుమార్, పార్టీ డివిజన్ నాయకుడు పిడమర్తి లింగయ్య, మండల నాయకులు చెరుకు ఎల్లయ్యలు మాట్లాడుతూ ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా బ్లాస్టింగ్ చేయడం వల్ల పంట పొలాల్లో కంకర పడి పంటలు దెబ్బతింటున్నాయని తెలిపారు. సాయంత్రం 4 గంటల నుంచే బ్లాస్టింగ్ చేయడం వల్ల రైతులు భయభ్రాంతులకు గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తక్షణమే క్రషర్ మిల్లుపై విచారణ జరిపించి, దానిని సీజ్ చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు నిమ్మరబోయిన గణేశ్, అల్దాసు వెంకన్న, వడకల మహేశ్, డొనేటి మల్సూర్, మహేశ్ పాల్గొన్నారు.

ఎల్లమ్మకు బోనాలు

ఎల్లమ్మ ఆలయానికి బోనాలతో వెళ్తున్న యాదవులు

హుజూర్‌నగర్, జూలై 23 : హుజూర్‌నగర్ పట్టణ పరిధిలో ఫైర్ స్టేషన్‌వద్ద ఉన్న ఎల్లమ్మ తల్లికి మంగళవారం యాదవులు బోనాలు సమర్పించారు. ఆషాడ మాసం సందర్భంగా నిర్వహించిన ఉత్సవాల్లో 23వ వార్డు కౌన్సిలర్ జక్కుల వీరయ్య పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. మహిళలు బోనాలతో తరలివెళ్లి ఎల్లమ్మ తల్లికి నైవేద్యం సమర్పించారు. కార్యక్రమంలో వర్ధనమ్మ, గురుప్రసాద్, లక్ష్మణ్, పంతులమ్మ, నాగమ్మ, నరేశ్, వెంకన్న, వీరబాబు పాల్గొన్నారు.

ఉధృతంగా మూసీ

జాజిరెడ్డిగూడెం బ్రిడ్జి వద్ద మూసీ వాగు పరవళ్లు

అర్వపల్లి, జూలై 23 : హైదరాబాద్ పరిసర ప్రాంతాల్లో వారం రోజులుగా వర్షాలు కురుస్తుండడంతో మూసీ ఉధృతంగా ప్రవహిస్తున్నది. మండలంలోని జాజిరెడ్డిగూడెం బ్రిడ్జి వద్ద మూసి ప్రవాహం అధికంగా ఉండడంతో సమీప గ్రామాల రైతులు, మత్స్యకారులు చేపల వేటకు వెళ్లవద్దని నీటి పారుదలశాఖ అధికారులు కోరారు. వరద ప్రవాహంతో రైతుల బోర్లు, పైపులు, వైర్లు కొట్టుకుపోయాయి.

విద్యానగర్‌లో వీధి కుక్కల పట్టివేత

బొడ్రాయిబజార్, జూలై 23 : సూర్యాపేట మున్సిపాలిటీ పరిధిలోని పలు వార్డుల్లో కుక్కల బెడద అధికంగా ఉన్నట్లు అందిన ఫిర్యాదుల మేరకు మున్సిపల్ సిబ్బంది కుక్కలను పట్టుకునే కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. సోమవారం 45వ వార్డు విద్యానగర్‌లో వీధి కుక్కలను పట్టుకొని సంరక్షణ కేంద్రానికి తరలించారు. ఈ సందర్భంగా వార్డు కౌన్సిలర్ గండూరి పావనీ కృపాకర్ మాట్లాడుతూ ప్రజలు వీధి కుక్కలకు ఆహారం వేయవద్దని, పెంపుడు కుక్కలను వీధుల్లో వదిలి పెట్టవద్దని సూచించారు.

మొక్కలు విరివిగా నాటి సంరక్షించాలి

● జడ్పీ సీఈఓ సురేశ్

అధికారులకు సూచనలిస్తున్న జడ్పీ సీఈఓ సురేశ్

నడిగూడెం, జూలై 23: ప్రతి ఒక్కరూ మొక్కలు విరివిగా నాటి సంరక్షించాలని జడ్పీ సీఈఓ సురేశ్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంతో పాటు తెల్లబెల్లి గ్రామంలోని సంపద వనాలను ఆయన పరిశీలించారు. సంపద వనాలలో మొక్కల సంరక్షణకు చర్యలు చేపట్టాలని సిబ్బందికి సూచించారు. అనంతరం గ్రామాలల్లో చేపడుతున్న పారిశుధ్య పనులను పరిశీలించారు. మురుగు కాల్వల్లో నీరు నిల్వ ఉండకుండా చూడాలని సిబ్బందిని ఆదేశించారు. ఆయన వెంట డీఆర్‌డీఏ పీడీ మధుసూదన్ రాజు, ఎంపీడీఓ ఇమామ్, అధికారులు ఉన్నారు.

స్మితా సబర్వాల్‌పై చర్యలు తీసుకోవాలి

● సూర్యాపేటలో దివ్యాంగుల నిరసన

బొడ్రాయిబజార్, జూలై 23 : దివ్యాంగులపై అనుచిత వ్యాఖ్యలు చేసిన రాష్ట్ర ఆర్థికశాఖ కార్యదర్శి స్మితా సబర్వాల్‌పై ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని దివ్యాంగుల హక్కుల వేదిక జాతీయ వేదిక జిల్లా అధ్యక్షుడు అర్వపల్లి లింగయ్య డిమాండ్ చేశారు. వేదిక ఆధ్వర్యంలో మంగళవారం స్థానిక పాతబస్టాండ్ వద్ద నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన వ్యక్తం చేశారు. అనంతరం పోలీస్‌స్టేషన్‌లో ఆమెపై ఫిర్యాదు చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ దివ్యాంగులను కించపర్చేలా ట్విట్టర్‌లో పోస్టు పెట్టడాన్ని తీవ్రంగా ఖండించారు. ఐక్యరాజ్య సమితి హక్కుల ఒప్పంద పత్రం, 2016 ఆర్‌పీడబ్ల్యూపీ చట్టంలో పేర్కొన్న సమానత్వం, దివ్యాంగుల పట్ల వివక్షకు ఆమె పెట్టిన పోస్టు విరుద్ధంగా ఉందన్నారు. 2016 ఆర్‌పీడబ్ల్యూపీ చట్టం సెక్షన్ 92(ఎ), (బీ), (ఈ) కింద ఆమెపై కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎన్‌పీఆర్‌డీ జిల్లా కార్యదర్శి వీరబోయిన వెంకన్న, వెలుగు వనిత, నాయకులు నరంశెట్టి వీరయ్య, ఎస్.రామారావు, బి.కిరణ్, ఎన్.రామ్‌కుమార్, వి.వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

కోదాడ మండల పాస్టర్స్ ఫెలోషిప్ కార్యవర్గం ఎన్నిక

పాస్టర్స్ ఫెలోషిప్ నూతన కార్యవర్గం

కోదాడటౌన్, జూలై 23 : కోదాడ పట్టణంలోని ఎల్ల దాయి ప్రార్థనా మందిరంలో కోదాడ పట్టణ, మండల పాస్టర్స్ ఫెలోషిప్ కమిటీని సంఘం నియోజకవర్గ అధ్యక్షుడు బిషప్ జె. సుదర్శనం ఆధ్వర్యంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. పట్టణ అధ్యక్షుడిగా పి.పాల్‌చారి, ప్రధాన కార్యదర్శిగా జె. దానియేలు, కోశాధికారిగా జి. ఆమోస్, ఉపాధ్యక్షుడిగా పి.వినోద్, వర్కింగ